"మధురమైన పిల్లలు - సదా సంతోషములో ఉండండి మరియు ఇతరులకు కూడా సంతోషమును కలిగించండి, ఇదే అందరి పైనా కృప చూపించడము, ఎవరికైనా దారిని చూపించడమనేది అన్నింటికన్నా పెద్ద పుణ్యము"

ప్రశ్న:- సదా ప్రసన్నచిత్తులుగా ఎవరు ఉండగలరు? ప్రసన్నచిత్తులుగా అయ్యేందుకు సాధనము ఏమిటి?

జవాబు:- ఎవరైతే జ్ఞానములో చాలా తెలివైనవారిగా ఉంటారో, ఎవరైతే డ్రామాను ఒక కథ వలె తెలుసుకుంటారో మరియు స్మరణ చేస్తారో, వారే సదా ప్రసన్నచిత్తులుగా ఉండగలరు. ప్రసన్నచిత్తులుగా అయ్యేందుకు సదా తండ్రి శ్రీమతంపై నడుస్తూ ఉండండి. స్వయాన్ని ఆత్మగా భావించండి మరియు తండ్రి ఏదైతే అర్థం చేయిస్తారో దానిని మంచి రీతిలో మంథనము చెయ్యండి. విచార సాగర మంథనము చేస్తూ-చేస్తూ ప్రసన్నచిత్తులుగా అయిపోతారు.

ఓంశాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలతో ఆత్మిక సంభాషణను చేస్తున్నారు. వారొక్కరే మన తండ్రి అన్నదైతే ఆత్మలకు తెలుసు, వారు శిక్షణ కూడా ఇస్తారు. టీచర్ పని శిక్షణను ఇవ్వటము, గురువు పని గమ్యమును తెలియజేయటము. గమ్యము గురించి కూడా పిల్లలు అర్థం చేసుకున్నారు. ముక్తి-జీవన్ముక్తి కొరకు స్మృతి యాత్ర చాలా అవసరము. నిజానికి రెండూ సహజమే. 84 జన్మల చక్రము కూడా తిరుగుతూ ఉంటుంది. ఇప్పుడు మన 84 జన్మల చక్రము పూర్తయ్యింది, ఇప్పుడు తిరిగి వెళ్ళాలి అన్నది గుర్తుండాలి. కానీ పాపాత్ములు ముక్తి-జీవన్ముక్తిలోకి తిరిగి వెళ్ళలేరు. ఈ-ఈ విధంగా విచార సాగర మంథనము చెయ్యాలి. ఎవరు చేస్తారో వారే పొందుతారు. సంతోషములోకి కూడా వారే వస్తారు మరియు ఇతరులను కూడా సంతోషములోకి వారే తీసుకువస్తారు. ఇతరులపై కూడా - దారిని చూపించే కృపను చూపించాలి. ఇది పురుషోత్తమ సంగమయుగమని పిల్లలైన మీకు తెలుసు. ఇది కూడా కొంతమందికి గుర్తుంటుంది, కొంతమందికి గుర్తుండదు, మర్చిపోతారు. ఇది గుర్తున్నా సరే సంతోషపు పాదరసము పైకెక్కి ఉంటుంది. తండ్రి, టీచర్, గురువుల రూపములో స్మృతి చేసినా కూడా సంతోషపు పాదరసము పైకెక్కి ఉంటుంది. కానీ నడుస్తూ-నడుస్తూ కొంత గజిబిజి అయిపోతుంది. ఏ విధంగా పర్వతాలపై కిందకి-పైకి ఎక్కటము ఉంటుందో, పిల్లల అవస్థ కూడా అలాగే ఉంటుంది. కొంతమంది చాలా పైకి ఎక్కిన తరువాత కింద పడిపోతే ముందు కన్నా కూడా ఎక్కువ పడిపోతారు. చేసుకున్న సంపాదన నష్టమైపోతుంది. ఎంతగా దాన-పుణ్యాదులు చేసినా కానీ, మళ్ళీ పుణ్యము చేస్తూ-చేస్తూ ఒకవేళ పాపము చెయ్యటం మొదలుపెడితే మొత్తం పుణ్యమంతా సమాప్తమైపోతుంది. అన్నింటికన్నా పెద్ద పుణ్యము - తండ్రిని స్మృతి చెయ్యటము. స్మృతి ద్వారానే పుణ్యాత్ములుగా అవుతారు. ఒకవేళ సాంగత్యపు రంగు వలన పొరపాటు మీద పొరపాటు చేస్తూ ఉన్నట్లయితే ముందు కన్నా ఎక్కువ కింద పడిపోతారు. అప్పుడిక ఆ ఖాతా జమ అయి ఉండదు. నష్టము వాటిల్లుతుంది. పాపపు పనులు చేయడం వలన నష్టము కలుగుతుంది. పాపపు ఖాతా చాలా ఎక్కువ పెరుగుతుంది. ఖాతాను సంభాళించడం జరుగుతుంది కదా. తండ్రి కూడా అంటారు - మీకు పుణ్య ఖాతా ఉండేది, పాపము చెయ్యటము వలన పాపం వంద రెట్లు అయిపోతుంది, అప్పుడింకా నష్టములోకి వచ్చేస్తారు. పాపాలు కూడా కొన్ని చాలా పెద్దవిగా, కొన్ని చిన్నవిగా ఉంటాయి. కామము చాలా కఠినమైనది, క్రోధము రెండవ నంబరు, లోభము అంతకన్నా తక్కువ. అన్నింటికన్నా ఎక్కువగా కామానికి వశమవ్వటం వలన, ఏదైతే జమ అయ్యిందో అది నష్టమైపోతుంది. లాభానికి బదులు నష్టం వాటిల్లుతుంది. సద్గురువుకు నింద తీసుకొచ్చేవారు ఉన్నత స్థానాన్ని పొందలేరు. తండ్రికి చెందినవారిగా అయ్యి మళ్ళీ వదిలేస్తారు. దానికి కారణం ఏమిటి? చాలా వరకు కామము యొక్క దెబ్బ తగులుతుంది. ఇది చాలా కఠినమైన శత్రువు. దాని దిష్టిబొమ్మనే తయారుచేసి కాలుస్తారు. క్రోధము, లోభము యొక్క దిష్టిబొమ్మలను తయారుచేయరు. కామము పైనే పూర్తి విజయాన్ని పొందాలి, అప్పుడు జగత్ జీతులుగా అవుతారు. రావణరాజ్యములో పతితముగా అయిన మమ్మల్ని మీరు వచ్చి పావనంగా చెయ్యండి అని పిలుస్తారు కూడా. పతిత-పావనా అనైతే అందరూ అంటారు, ఓ పతితులను పావనంగా చేసే సీతల యొక్క రాముడా రండి అని అందరూ పాడుతారు. కానీ అర్థాన్ని అర్థం చేసుకోరు. తండ్రి తప్పకుండా కొత్త ప్రపంచాన్ని స్థాపన చేయడానికి వస్తారు అన్నది కూడా తెలుసు. కానీ సమయాన్ని చాలా పొడిగించటం వలన ఘోర అంధకారముగా అయిపోయింది. జ్ఞానము మరియు అజ్ఞానము ఉన్నాయి కదా. భక్తి అజ్ఞానము, ఎవరి పూజనైతే చేస్తారో వారి గురించి తెలియనే తెలియదు. మరి వారి వద్దకు ఎలా చేరుకుంటారు? అందుకే దాన-పుణ్యాదులు మొదలైనవి నిష్ఫలమైపోతాయి. కాకపోతే అల్పకాలము కొరకు కాకి రెట్ట సమానమైన సుఖము కొంత లభిస్తుంది. మిగిలినదంతా దుఃఖమే దుఃఖము. ఇప్పుడు తండ్రి అంటారు - నన్ను ఒక్కరినే స్మృతి చేసినట్లయితే మీ దుఃఖాలన్నీ దూరమైపోతాయి. పాతది అంతమైపోయి కొత్తది జమ అయ్యే

విధంగా మేము ఎంత స్మృతి చేస్తున్నాము అని ఇప్పుడు చూసుకోవాలి. కొందరైతే ఏమీ జమ చేసుకోరు. మొత్తం ఆధారమంతా స్మృతి పైనే ఉంది. స్మృతి లేకుండా పాపాలు ఎలా తొలగుతాయి లేక ఎలా అంతమవుతాయి. జన్మ-జన్మాంతరాల పాపాలు అయితే ఎన్నో ఉన్నాయి. ఈ జన్మ యొక్క జీవిత గాథను వినిపించడం వలన జన్మ-జన్మాంతరాల పాపాలేమీ అంతమవ్వవు. కేవలం ఈ జన్మవే తేలిక అవుతాయి. ఇకపోతే చాలా శ్రమ చేయవలసి ఉంటుంది, ఇన్ని జన్మల యొక్క లెక్కాచారాలేవైతే ఉన్నాయో అవి యోగముతోనే అంతమవ్వనున్నాయి. ఆలోచించాలి - మా యోగము ఎంత ఉంది? మా జన్మ సత్యయుగ ఆదిలో జరుగగలదా? ఎవరైతే చాలా పురుషార్థం చేస్తారో, వారే సత్యయుగ ఆదిలో జన్మ తీసుకుంటారు. అటువంటివారు దాగి ఉండలేరు. అందరూ అయితే సత్యయుగంలోకి రారు. చివరిలో కాస్త పదవిని పొందుతారు. ఒకవేళ ముందే వచ్చినా కానీ సేవ చేస్తారు. ఇది అర్థం చేసుకోవలసిన సాధారణమైన విషయము. అందుకే తండ్రిని చాలా ఎక్కువ స్మృతి చెయ్యాలి. మనం కొత్త ప్రపంచం కొరకు విశ్వాధిపతులుగా అవ్వడానికి వచ్చామని మీకు తెలుసు. ఎవరైతే స్మృతి చేస్తారో వారికి తప్పకుండా సంతోషముంటుంది. ఒకవేళ రాజులుగా అవ్వాలంటే ప్రజలను కూడా తయారుచేయాల్సి ఉంటుంది. లేదంటే మీరు రాజులుగా అవ్వనున్నారని ఎలా అర్థమవుతుంది. ఎవరైతే సెంటర్లు తెరుస్తారో, సేవ చేస్తారో వారికి కూడా సంపాదన జరుగుతుంది. వారికి కూడా ఎంతో లాభము కలుగుతుంది. వారికి కూడా ప్రతిఫలం లభిస్తుంది. కొందరు 3-4 సెంటర్లు కూడా తెరుస్తారు కదా. ఎవరెవరైతే చేస్తారో వారికి దానిలో భాగమైతే లభిస్తుంది కదా. అందరూ కలిసి మాయ యొక్క దుఃఖపు భారాన్ని తొలగిస్తారు కావున ఇందులో అందరూ తమ భుజాన్ని అందిస్తారు. కావున అందరికీ ప్రతిఫలం లభిస్తుంది. ఎవరైతే అనేకులకు దారిని తెలియజేస్తారో, వారు ఎంతగా శ్రమిస్తారో అంతటి ఉన్నత పదవిని పొందుతారు. వారికి సంతోషము ఎంతో ఉంటుంది. మేము ఎంతమందికి దారిని చూపించాము? ఎంతమందిని ఉద్ధరించాము? అన్నది హృదయానికి తెలుసు. అన్నీ చేయడానికి సమయమైతే ఇదే. ఆహార-పానీయాలైతే అందరికీ లభిస్తాయి. కొందరైతే ఏ పనిని చెయ్యరు. మమ్మా ఎంత సేవను చేసారు. సేవ ద్వారా వారిది ఎంతో కళ్యాణము జరిగింది. ఇందులో కూడా సేవ చాలా కావాలి. యోగము కూడా సేవయే కదా. ఎంత లోతైన డైరెక్షన్లు లభిస్తూ ఉంటాయి. ఇప్పుడిక మున్ముందు ఏమేమి పాయింట్లు వెలువడుతాయి. రోజురోజుకు ఉన్నతి జరుగుతూ ఉంటుంది. కొత్త-కొత్త పాయింట్లు వెలువడుతాయి. ఎవరైతే సేవలో తత్పరులై ఉంటారో, వారు ఆ పాయింట్లను వెంటనే పట్టుకుంటారు. ఎవరైతే సేవ చెయ్యరో వారి బుద్ధిలో ఏమీ కూర్చోదు. బిందు రూపాన్ని ఎలా అర్థం చేసుకుంటారు? ఆత్మ ఎంత పెద్దది, ఆత్మ యొక్క దేశ, కాలాలను చెప్పండి అని మీరు ఎవరినైనా అడిగితే, ఎప్పటికీ చెప్పలేరు. మనుష్యులు పరమాత్మని నామ, రూప, దేశ కాలాలను గురించి అడుగుతారు. మీరు ఆత్మ గురించి అడిగితే తికమకపడతారు. ఎవ్వరికీ తెలియదు. ఆత్మ ఇంత చిన్నని బిందువు, అందులో ఇంతటి పాత్ర అంతా నిండి ఉంది. ఇక్కడ కూడా ఆత్మ పరమాత్మల గురించి తెలియనివారు ఎంతోమంది ఉన్నారు. కేవలం వికారాలను సన్యసించారు, అది కూడా అద్భుతమే. సన్యాసుల ధర్మము వేరు. ఈ జ్ఞానం మీ కోసమే. తండ్రి అర్థం చేయిస్తారు - మీరు పవిత్రంగా ఉండేవారు, తర్వాత అపవిత్రంగా అయ్యారు, ఇప్పుడు మళ్ళీ పవిత్రంగా అవ్వాలి. మీరే 84 జన్మల చక్రములో తిరుగుతారు. ప్రపంచంలో కొంచెం కూడా ఈ విషయాల గురించి తెలియదు. జ్ఞానము వేరు, భక్తి వేరు. జ్ఞానము పైకి తీసుకువెళ్తుంది, భక్తి కింద పడేస్తుంది. కావున రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. మనుష్యులు తమను తాము ఎంతగా వేద-శాస్త్రాలకు అథారిటీలుగా భావించినా కానీ వారికి ఏమీ తెలియదు. మీకు కూడా ఇప్పుడే తెలిసింది. మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. మర్చిపోయిన కారణంగానే సంతోషము మాయమవుతుంది. లేదంటే అపారమైన సంతోషము ఉండాలి. బాబా నుండి మీకు ఈ వారసత్వము లభిస్తుంది. బాబా సాక్షాత్కారము చేయిస్తారు. కానీ సాక్షాత్కారము కలిగినా శ్రీమతముపై నడవకపోతే లాభమేముంది! తండ్రిని దుఃఖములో తలచుకుంటారు. తండ్రిని ముక్తిప్రదాత అని అంటారు. ఓ రామ, ఓ ప్రభూ అని అంటారు. కానీ వారు ఎవరు అన్నది తెలియదు. భక్తిలో ఎవ్వరూ - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చెయ్యండి అని చెప్పరు. అస్సలు చెప్పరు. ఒకవేళ అలా చెప్పి ఉంటే పరంపరగా కొనసాగుతూ వచ్చి ఉండేది. భక్తి అయితే కొనసాగుతూ వస్తుంది కదా. భక్తి ఎంతగానో ఉంది. జ్ఞానము ఒక్కటే. భక్తి ద్వారా భగవంతుడు లభిస్తారని మనుష్యులు భావిస్తారు. కానీ ఎలా, ఎప్పుడు? ఇది తెలియదు. భక్తి ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎవరు ఎక్కువ భక్తి చేస్తారు - ఇది ఎవ్వరికీ తెలియదు. 40 వేల సంవత్సరాలు ఇంకా భక్తిని చేస్తూనే ఉంటారా ఏమిటి? ఒకవైపు మనుష్యులు భక్తిని చేస్తూ ఉన్నారు, మరొకవైపు మీరు జ్ఞానాన్ని పొందుతూ ఉన్నారు. మనుష్యుల వెనుక ఎంతగా కష్టపడవలసి వస్తుంది. ఇన్ని ప్రదర్శనీలను చేస్తారు, అయినా కూడా కోట్లలో కొద్దిమంది మాత్రమే వెలువడుతారు. ఎంతమందిని మీ సమానంగా తయారుచేసి తీసుకువస్తారు. సత్యాతి-సత్యమైన బ్రాహ్మణులు ఎంతమంది అనే లెక్కను ఇప్పుడు తీయలేము. చాలామంది అసత్యమైన పిల్లలు కూడా ఉన్నారు. బ్రాహ్మణులు కథను వినిపిస్తారు. బాబా గీతా కథను వినిపిస్తారు. యథా బాబా, తథా పిల్లలు, మీరు కూడా వినిపిస్తారు. సత్యాతి-సత్యమైన గీతను వినిపించటమనేది

పిల్లల పని కూడా. శాస్త్రాలైతే అందరివీ ఉన్నాయి. వాస్తవానికి ఈ శాస్త్రాలు మొదలైనవి ఏవైతే ఉన్నాయో, ఇవన్నీ భక్తి మార్గానికి చెందినవి. జ్ఞానానికి సంబంధించిన పుస్తకము ఒక్క గీతయే. గీతయే తల్లి-తండ్రి. తండ్రియే వచ్చి అందరి సద్గతిని చేస్తారు. మనుష్యులేమో ఇటువంటి తండ్రినే గ్లాని చేస్తారు. శివబాబా జయంతి వజ్రతుల్యమైనది. ఉన్నతోన్నతుడైన భగవంతుడే సద్గతిదాత. ఇతరులెవ్వరికైనా మహిమ ఎలా జరుగగలదు? దేవతల మహిమను చేస్తారు కానీ దేవతలుగా తయారుచేసేవారు ఒక్క తండ్రియే. మనది స్థాపన కూడా జరుగుతుంది, వినాశనం కూడా జరుగుతుంది. ఏమీ అర్థం చేయించలేనివారు చాలా మంది ఉన్నారు, అటువంటప్పుడు స్థూలమైన కార్యాలు చెయ్యండి. మిలట్రీలో అన్ని పనులు చేసేవారు ఉంటారు. చదువుకున్నవారి ముందు చదువుకోనివారు సేవ చేయవలసి ఉంటుంది అని అంటూ ఉంటారు కూడా. మమ్మా, బాబా ఏదైతే చేస్తారో, వారి నుండి నేర్చుకోండి. అనన్యులైన పిల్లలు ఎవరు అన్నది మీరు కూడా అర్థం చేసుకోగలరు. బాబాను అడిగినట్లయితే - ఫలానా వారిని ఫాలో చెయ్యండి అని బాబా కూడా పేరు చెప్తారు. ఎవరైతే సేవాధారీ పిల్లలు కారో వారు ఇతరులకు ఏం నేర్పించగలరు. వారు ఇంకా సమయాన్ని వృథా చేస్తారు. బాబా అర్థం చేయిస్తారు - మీ ఉన్నతిని చేసుకోవాలనుకుంటే ఇక్కడ చేసుకోవచ్చు. మనము 84 జన్మలను ఎలా తీసుకున్నాము అన్న చిత్రాలు పెట్టి ఉన్నాయి. దీనిని ఇప్పుడు అర్థం చేసుకున్నట్లయితే ఇతరులకు అర్థం చేయించండి. ఎంత సహజముగా ఉంది - ఈ విధంగా తయారవ్వాలి. నిన్న వీరి పూజను చేసేవారము, ఈ రోజు చెయ్యడం లేదు. జ్ఞానము లభించింది. ఈ విధంగా చాలామంది వచ్చి జ్ఞానాన్ని తీసుకుంటారు. ఎంతగా మీరు సెంటర్లను ఎక్కువగా తెరుస్తూ ఉంటారో, అంతగా ఎంతోమంది వచ్చి అర్థం చేసుకుంటారు. వినటం ద్వారా వారికి సంతోషపు పాదరసము పైకెక్కుతుంది. నరుని నుండి నారాయణునిగా అవ్వాలి. ఇది సత్యమైన సత్యనారాయణుని కథ కూడా. భక్తి ద్వారానైతే పడిపోతూనే ఉంటారు. జ్ఞానం అంటే ఏమిటి అన్నది వారికి తెలియను కూడా తెలియదు. మీకు అనంతమైన తండ్రి యథార్థముగా అర్థం చేయిస్తారు. బాబా అంటారు, నిన్న మీకు రాజ్యాన్ని ఇచ్చాను, మరి మీ రాజ్యము ఎక్కడికి వెళ్ళిపోయింది? ఇదైతే మీకు తెలుసు. ఇది ఆట. ఒక్క తండ్రియే పూర్తి ఆట యొక్క రహస్యాన్ని తెలియజేస్తారు. మనము అంటాము - బాబా, మీరు డ్రామాలో బంధింపబడి ఉన్నారు, పతిత ప్రపంచములోకి, పతిత శరీరములోకి మీరు రావలసిందే. ఈశ్వరునికి ఎంతో మహిమను చేస్తారు. పిల్లలు అంటారు - బాబా, మేము మిమ్మల్ని పిలిచాము కావున మా సేవ చేయడానికి మరియు మమ్మల్ని పతితుల నుండి పావనులుగా చేయడానికి మీరు తప్పకుండా రావాల్సి వచ్చింది. కల్ప-కల్పము మమ్మల్ని దేవతలుగా తయారుచేసి మీరు వెళ్ళిపోతారు. ఇది ఒక కథ లాంటిది, తెలివైనవారు ఎవరైతే ఉంటారో వారి కొరకైతే ఇది ఒక కథ. పిల్లలైన మీరు ప్రసన్నచిత్తులుగా ఉండాలి. బాబా కూడా డ్రామా అనుసారంగా సేవకులయ్యారు. తండ్రి అంటారు - నా మతంపై నడవండి, స్వయాన్ని ఆత్మగా భావించండి, దేహాభిమానాన్ని విడిచిపెట్టండి. కొత్త ప్రపంచములో మీకు కొత్త శరీరము లభిస్తుంది. తండ్రి ఏదైతే అర్థం చేయిస్తారో దానిని మంచి రీతిలో మంథనము చెయ్యండి. ఇలా తయారయ్యేందుకు మేము వచ్చామని బుద్ధి ద్వారా అర్థం చేసుకుంటారు. లక్ష్యము-ఉద్దేశ్యము ఎదురుగా నిలబడి ఉన్నాయి. భగవానువాచ. వారు భగవంతుడిని మనిషిగా భావిస్తారు లేదా నిరాకారుడు అని అంటారు. ఆత్మలైన మీరందరూ కూడా నిరాకారియే. శరీరాన్ని ధరించి పాత్రను అభినయిస్తారు, బాబా కూడా పాత్రను అభినయిస్తారు. ఎవరైతే మంచి సేవను చేస్తారో, వారికే మేము మాలలోని మణిగా తప్పకుండా అవుతాము అన్న నిశ్చయము ఉంటుంది. నరుని నుండి నారాయణునిగా అవ్వాలి. భగవంతుడు చదివిస్తున్నప్పుడు మంచి రీతిలో చదువుకోవాలి. కానీ మాయ అపోజిషన్ చాలా ఉంటుంది. మాయ తుఫానులలోకి తీసుకువస్తుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. విచార సాగర మంథనము చేసి అపారమైన సంతోషాన్ని అనుభవము చేయాలి. ఇతరులకు కూడా దారిని తెలియజేసే కృపను చూపించాలి. సాంగత్యపు రంగులోకి వచ్చి ఎటువంటి పాపపు కర్మను చెయ్యకూడదు.

2. మాయ యొక్క దుఃఖాలనే భారాన్ని తొలగించేందుకు అందరూ భుజం కలపాలి. సెంటర్లు తెరిచి అనేకుల కల్యాణానికి నిమిత్తులుగా అవ్వాలి.

వరదానము:- మీ మాటల యొక్క విలువను అర్థం చేసుకుని వాటిని ఎకానమీ చేసే మహాన్ ఆత్మా భవ

మహాన్ ఆత్మల గురించి సత్య వచన్ మహారాజ్ అని అంటారు. కావున మీ మాటలు సదా సత్య వచనాలుగా అనగా ఏదో ఒక ప్రాప్తిని కలిగించే వచనాలుగా ఉండాలి. బ్రాహ్మణుల నోటి నుండి ఎప్పుడూ ఎవరికీ శాపమునిచ్చే మాటలు వెలువడకూడదు. అందుకే యుక్తియుక్తముగా మాట్లాడండి మరియు పనికొచ్చే మాటలు మాట్లాడండి. మాటల యొక్క విలువను తెలుసుకోండి. శుభకరమైన మాటలను, సుఖాన్ని ఇచ్చే మాటలను మాట్లాడండి, పరిహాసముతో కూడిన మాటలను మాట్లాడకండి, మాటల ఎకానమీని (పొదుపును) చేయండి, అప్పుడు మహాన్ ఆత్మగా అవుతారు.

స్లోగన్:- ఒకవేళ శ్రీమతమనే చెయ్యి సదా తోడుగా ఉన్నట్లయితే మొత్తమన్ని యుగాలలోనూ చేతిలో చెయ్యి వేసి నడుస్తూ ఉంటారు.

అవ్యక్త సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

ఏ విధంగా లైట్ (విద్యుత్తు) కనెక్షన్ ద్వారా పెద్ద-పెద్ద మెషినరీలు నడుస్తాయో, అలా మీరందరూ ప్రతి పనిని చేస్తూ కనెక్షన్ ఆధారంతో స్వయం కూడా డబుల్ లైట్ గా అయ్యి నడుస్తూ ఉండండి. ఎక్కడైతే డబుల్ లైట్ స్థితి ఉంటుందో, అక్కడ శ్రమ మరియు కష్టము అన్న పదాలు సమాప్తమైపోతాయి. నాది అన్న భావాన్ని సమాప్తము చేసి నిమిత్త భావము మరియు ఈశ్వరీయ సేవా భావన ఉన్నట్లయితే డబుల్ లైట్ గా అవుతారు.